క్లుప్తంగా

బీసీసెల్ కార్యదర్శిగా నాగేశ్వరరావు నియామకంపై హర్షం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘ నాయకుడు రాజారపు శివ నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితుల య్యారు. ఈ సందర్భంగా శనివారం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజారపు శివ నాగేశ్వరరావు నియామకం పట్ల ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏపీపీ బగ్గి నరసింహారావు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు తదితరులు అభినందనలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగ వెంకటలక్ష్మి శనివారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, మనోవర్తి కేసులు, సివిల్ తగాదాలు, రెవిన్యూ కేసులు, ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించబడతాయని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు త్యాగరాజ ఆరాధనోత్సవాలు


సత్తెనపల్లి: వాగ్గేయకారులు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్నాయి. సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని శరభయ గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు హైదరాబాద్‌కు ప్రసిద్ధ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ రవి కులోత్తమరావు హాజరవుతారని ఎస్‌వీసీబీ సభ్యులు తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం



సత్తెనపల్లి: విద్యార్థి దశలోనే బాల, బాలికలు ఆరోగ్యవంతులుగా ఉండడానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ దాసరి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని భాష్యం పాఠశాలలో ప్రైమరీ ఇంట్రా స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ శనివారం నిర్వహించారు.ఈ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రులకు కూడా ఆటల పోటీలు నిర్వహించడం విశేషమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సుందర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదుల్లోనే కాకుండా మనో వికాసానికి క్రీడల్లోనూ రాణించాలన్నారు. గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ముందుగా భారీ జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో చాంప్స్ హెచ్ ఎమ్ వి. భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



అచ్చంపేట: సుమారు 30 మంది కూలీలతో వెళుతున్న టాటాఏస్ ఆటో బోల్తాకొట్టడంతో 5గురికి తీవ్ర గాయాలు కాగా, మరో అయిదుగురికి స్వల్పగాయాలైన ఘటన మండలంలోని సంద్రతండా వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన సుమారు 30 మంది కూలీలు మిర్చి కోతలకు తాడువాయి గ్రామ పంచాయతీ పరిధిలోని సంద్రతండాకు వెళ్లి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది.ఈ ప్రమాదంలో అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన వారిని సత్తెనపల్లిలోని కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదకూరపాడు బీజేపీ అభ్యర్థిగా పోటీ

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని పల్నాడు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. శనివారం అయన తన స్వగ్రామమైన వైకుంఠపురంలో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ తరపున పొత్తులు ఉన్నా లేకున్నా తాను పోటీ చేస్తానన్నారు. అందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజావైద్యం అభివృద్ధికి తొలి ప్రాధాన్యం



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అమరావతిలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం ప్రారంభం

అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకే అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.3.29కోట్లతో అభివృద్ధి చేశామని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు రూ.40 లక్షలతో నిర్మించిన రెండో సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీహెచ్‌సీ అభివృద్ధికి రూ.3.29 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2019కి ముందు అమరావతి ఆస్పత్రి శిథిలావస్థలో ఉండేదని డాక్టర్లు, మందులు లేక రోగులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఈ నాలుగున్నరేళ్ళలో ఆస్పత్రి అభివృద్ధికి నిరంతర కృషి చేశామన్నారు. అమరావతి పరిసర గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగుడుతున్న ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చటానికి కృషి చేస్తానన్నారు.పల్నాడు జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ అస్పత్రుల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు వస్తే అందులో రూ.23 కోట్లు పెదకూరపాడు నియోజకవర్గానికే కేటాయించటంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిదన్నారు.

మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. రూ.35 లక్షలతో నిర్మించిన ముస్లిం కమ్యూనిటీ హాల్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు.



సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, తదితరులు

నరుకుళ్లపాడు గ్రామంలో రూ.40 లక్షల విలువైన అభివద్ధి పనులను ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. రూ.21.75 లక్షలతో నిర్మించిన రైతు భరోసాకేంద్రం, రూ.17.5 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్ నెస్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కరుణకుమారి, కోఅప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు తదితరులు అర్ హెచ్ ప్రసాద్, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆలపాటి వీరయ్య, సర్పంచ్‌లు పి రాజేశ్వరి, మాదాసు పావని, నరుకుళ్ళపాడు ఉప సర్పంచ్ నల్లిబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, అలా లక్ష్మీనారాయణ, అళ్ల శ్రీనివాసరెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు, మాదాసు రాంబాబు, నడకుదురు నాగరాజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయమే అభివృద్ధికి ఆలవాలం

అమరావతి: రాష్ట్రంలో ఆడపడుచుల ముఖాలలో సంతోషం చూడటమే అసలైన అభివృద్ధి అని కొత్త భాష్యం చెప్పిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం స్థానిక రామకృష్ణ హిందూ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో మరే ముఖ్యమంత్రి చేయలేని పనులు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆపకుండా అమలు చేసిన ఘనత జగనన్నదే నన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2 లక్షలకు పైగా ఉద్యోగాలివ్వడమే కాకుండా సచివాలయ వ్యవస్థతో పౌరసేవలను గడప ముందుకే తెచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లతో ప్రజా సంక్షేమానికి అసలైన అర్థం చెప్పారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో జరిగిందన్నారు. గత పాలకులు కలలో కూడా ఊహించని అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు రూ.149 కోట్ల నిధులతో పూర్తిచేశామన్నారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల రూపురేఖలు మార్చే కృష్ణానదిపై బ్రిడ్జిని సైతం నిర్మించబోతున్నామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 1229 డ్వాక్రా గ్రూపులకు రూ.11.19 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, కోఅప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, జెసిఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, ధరణికోట సర్పంచ్ మాదాసు పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు అలా లక్ష్మీనారాయణ, అళ్ల శ్రీనివాసరెడ్డి, అమృతవేణి, గుంటూరు కుమారి, కంభంపాటి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలి

ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబూన్ బీ

సత్తెనపల్లి: మండల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సత్తెనపల్లి మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు ఎలవర్తిపాటి షేక్ జైబూన్ బీ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీపీ ఎలవర్తిపాటి జైబూన్ బీ మాట్లాడుతూ గ్రామాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ విజయవంతంగా జరుగుతుందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షలుగా ఉన్న ఉచిత వైద్య సేవల పరిధిని రాష్ట్ర ప్రభుత్వం దేశం లోనే తొలిసారిగా రూ.25 లక్షలకు పెంచిందని వెల్లడించారు.ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమ పనులు మండలంలోని అన్ని గ్రామాల్లో చురుగ్గా జరుగుతున్నాయన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లోని చెరువులను నింపడం, నూతన బోరింగ్ పంపులను వేయించడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.15వ ఆర్థిక సంఘం నిధులను ఏ విధంగా ఉపయోగించుకోవాలో, ఏఏ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో.. సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ రామ్మోహన్‌సింగ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మంగు శ్రీనివాస రావు, విద్యుత్ శాఖ ఏఈ తిరుపతయ్యలు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల అడ్మిన్‌స్ట్రేటివ్ ఆఫీసర్ బసవకుమారి, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైబూన్ బీ

గణతంత్ర పురస్కార గ్రహీతలకు సన్మానం

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వారిలో సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జెడ్ఎస్.రామచంద్రరావు, సత్తెనపల్లి ఏపీఎం శిఖా కృపావేణి ఉన్నారు. శనివారం వీరిరువురిని ఆయా శాఖల అధికారులు, అధ్యాపకులు అభినందించారు.





పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు, వెలుగు ఏపీఎం శిఖా కృపావేణి

పేదల హక్కుల సాధకుడు సీతారామశాస్త్రి

సత్తెనపల్లి: పేద ప్రజల హక్కుల సాధనకు పోరాడిన మహనీయుడు సత్తెనపల్లి మాజీ సర్పంచ్ చతుర్వేదుల సీతారామశాస్త్రి అని సీపీఎం రాష్ట్ర నాయకులు గద్దె చలమయ్య, సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని చతుర్వేదుల సీతారామ శాస్త్రి విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన 54వ వర్ధంతిలో వారు వేర్వేరుగా పాల్గొని మాట్లాడారు. సీతారామ శాస్త్రి పేదలకు ఉచిత వైద్యం అందించారని, జీవితాంతం నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాల కోసం పోరాడారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ రాజకీయాలలో పేదలకు అండగా అనేక ప్రజా పోరాటాలు శాస్త్రి నిర్వహించారన్నారు. తొలుత శాస్త్రి విగ్రహానికి శాస్త్రి కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమం, రైల్వే స్టేషన్ వద్ద వృద్ధులకు, పేదలకు అన్న సంతర్పణ, ఆశ్రమ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

క్రీడలతో ఆరోగ్యమయ జీవితం

- వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్
- ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు జెర్సీలు అందజేత



జెర్సీలు అందుకున్న క్రీడాకారులతో నాయకులు

సత్తెనపల్లి: జీవితంలో ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలాడటం మంచి ప్రక్రియ అని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా టౌన్ కబడ్డీ టీం క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్ స్పాన్సర్ చేసిన జెర్సీలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద క్రీడా సంబరం ఆడుదాం ఆంధ్రా అని, ప్రజలకు వ్యాయామంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతో ప్రోత్సాహకంగా నిలుస్తుందన్నారు. క్రీడలపై పట్టున్న వారిని గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వడమే దీని లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేశారు. స్పాన్సర్ చేసిన కౌన్సిలర్ శెట్టి ఆనంద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మక్కెన అచ్చయ్య, శెట్టి శ్రీనివాసరావు, శెట్టి స్వామి, సంకుల తిరుమలరావు, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, కబడ్డీ క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ విజేత ముప్పాళ్ళ

ముప్పాళ్ళ: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో వాలీబాల్ విభాగంలో ముప్పాళ్ళ జట్టు విజేతగా నిలిచింది. సత్తెనపల్లిలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ముప్పాళ్ళ జట్టు పాల్గొని ప్రతిభ కనబరిచింది. వాలీబాల్ విభాగంలో పురుషులు, మహిళల రెండు కేటగిరిల్లోనూ ముప్పాళ్ళ జట్లు విజేతగా నిలిచాయి. విజేతలను తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్, ఎంపీడీవో పీ.పుట్టారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, పీఈటీ ఎస్.కె.సుభానిలు అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా పోటీలు వరం

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రతిభను చాటే వేదికగా నిలుస్తుందని మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ప్రగతి పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ స్త్రీ, పురుషుల పోటీలను, శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజక వర్గ స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ యువతలో క్రీడా ఆసక్తి కలిగించేలా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిస్తే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానం ముప్పాళ్ళ, ద్వితీయ స్థానం సత్తెనపల్లి, తృతీయ స్థానం రాజుపాలెం, మహిళల విభాగంలో ప్రథమ స్థానం ముప్పాళ్ళ, ద్వితీయ స్థానం రాజుపాలెం, తృతీయ స్థానం సత్తెనపల్లి కైవసం చేసుకున్నాయి. కబడ్డీ పోటీల్లో మహిళల విభాగంలో ప్రథమస్థానం నకరికల్లు, ద్వితీయ స్థానం సత్తెనపల్లి, తృతీయస్థానం ముప్పాళ్ళ, పురుషుల విభాగంలో తృతీయ స్థానం రాజుపాలెం కైవసం చేసుకున్నాయి. నకరికల్లు-ముప్పాళ్ల జట్ల మధ్య పోటీ జరగాల్సి ఉంది. ఈ జట్లలో గెలుపొందిన జట్టు ప్రథమ స్థానాన్ని, ఓటమి పాలైన జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంటాయి. ఈ నెల 29న ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఫైనల్ పోటీల్లో సత్తెనపల్లి-నకరికల్లు తలపడతాయి.ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీలు షేక్ రియాజ్, షేక్ సుభాని, పుల్లయ్య, రత్నకుమారి, ఎస్. అచ్చిరెడ్డి, నోడల్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ముప్పాళ్ళ జట్టు



కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన నకరికల్లు జట్టు

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాయం-1, గ్రామ సచివాలయం-2(దేవరంపాడు)తో పాటు పలు అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఆదివారం ప్రారంభించనున్నారు. అభివృద్ధి పనులను ప్రారంభించడానికి రాష్ట్రమంత్రి అంబటితో పాటు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు మిర్చి మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తదితరులు పాల్గొంటున్నారు.

టౌన్ ఎస్‌ఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐగా ఎం.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్‌కి చెందిన సత్యనారాయణ పెదకూరపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, సత్తెనపల్లి టౌన్ సీఐ పి ప్రభాకరరావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

నకరికల్లు ఎస్‌ఐగా రాంబాబు బాధ్యతల స్వీకరణ



నకరికల్లు: నకరికల్లు ఎస్సైగా పైడి రాంబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు చేపడుతున్న ఏ.బాలకష్ణ బదిలీపై నరసరావుపేట రూరల్‌కు వెళ్లారు. దీంతో సత్తెనపల్లి రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న పైడి రాంబాబు నకరికల్లు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి శనివారం విధుల్లో చేరారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

రెంటచింతల: గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెంటాల గ్రామంలో రూ.45 లక్షల మైనింగ్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉన్నతాధికారులు ఇచ్చిన నిబంధనల మేరకు ఖచ్చితంగా నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. నాణ్యత లేకుండా పనులు చేసిన బిల్లులను నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో పాటు పశుపోషణ అవసరం



బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు 45 దూడలను ప్రదర్శించారు. అనంతరం ఈపూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పశు పోషకులు మేలు జాతి పశువులును ఎంచుకోవాలని, వ్యవసాయంతో పాటు పశుపోషణ రైతుకు అవసరమని, అదనపు ఆదాయం చేకూ రుతుందని చెప్పారు. ప్రతి ఏడాది ఒక దూడను సృష్టించే విధంగా యజమాన్య పద్ధతులు పాటిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో బొల్లాపల్లి, వెల్లటూరు పశు వైద్యాధికారులు పి అమీర్‌బాషా, జి కవిత,ఆర్‌బికె ఇన్‌చార్జి సి.హెచ్.ఎడుకొండలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవు



నరసరావుపేట: ఎటువంటి గొడవలకు కారణమైనా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని డీ ఎస్పీ కేవీ మహేష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మరో రెండు నెల ల్లో రానున్న ఎన్నికలను పురస్కరించుకుని శనివారం డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే వివిధ కారణాలతో మీపై రౌడీషీట్లు ఉన్నాయని, ఇక ముందు ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలిగితే వాటిని తొలగించే అవకాశం ఉందన్నారు. వచ్చే రెండు నెలల కాలంలో ఎన్నికలు జరుగుతాయని, ఈలోగా రాజకీయ పార్టీల ప్రచారం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దౌర్జన్యాలు, దాడులు, మారణాయుధాలతో తిరగటం, బెదిరింపులకు పాల్పడటం లాంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మీపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, అందరూ ప్రశాంత జీవనం చేయాలని సూచించారు. వినుకొండ, చిలకలూరిపేట, నరసరావుపేట సీఐలు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామ సమీపంలోని అడవుల్లో గల కుందేలు బోడు వద్ద నాటుసారా కాచే స్థావరాలపై ఎస్ఐ ఎస్‌కే. ఎండీ.ఫిరోజ్, పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా కాచే నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 200 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఎన్నికల విధులు చేపట్టే అధికారులు అప్రమత్తంగా ఉండాలని గురజాల ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సెక్టార్ అధికారులకు శనివారం ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన 21 మంది ఎన్నికల సెక్టారు అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన ప్పటినుంచి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల రూట్ ఆఫీసర్లు, ఎన్నికల ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించాల్సిన విధి విధానాలపై ఆర్‌డీవో వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవటంతోపాటు, అక్రమ మద్యం తరలింపు, నగదు తరలింపు వంటి కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.